క్లుప్తంగా

సత్యదేవునికి వెండి బహూకరణ



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో సత్యదేవుని ఆలయంలో స్వామివారికి మకర తోరణాన్ని తయారు చేసేందుకు భక్తులు విరివిగా ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా వాసవీ క్లబ్ గుడ్లవల్లేరు అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ, పార్థసారథి దంపతులు శనివారం ఆలయానికి రూ.7,500 విలువైన వెండిని స్వామివారికి సమర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేసి, వృద్ధులకు రూ.200 చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు. వాసవీ క్లబ్ జోన్ చైర్ పర్సన్ బచ్చు మురళీకృష్ణ, వాసవీ క్లబ్ ప్రతినిధులు చిట్టూరి శ్రీనివాస్, కార్యదర్శి బచ్చు సుదర్శన్, చిట్టూరి కామేశ్వరీ, కొప్పురావూరి మల్లీశ్వరి పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీనాయకులు, కార్యకర్తలు అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

ఆస్తిపన్ను వెంటనే చెల్లించండి

గుడివాడటౌన్: పట్టణంలో ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పురపాలక సంఘ పరిధిలోని ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీస్థలాల పన్నులు వెంటనే చెల్లించాలన్నారు. సకాలంలో పన్ను చెల్లించకపోతే నూటికి రూ.2 చొప్పున అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. అపరాధ రుసుం రద్దుకు ప్రభుత్వ ఆదేశాలు లేనందున వడ్డీరాయితీ ఆశించకుండా వెంటనే పన్ను చెల్లించాలని ఆయన సూచించారు.

మహిళలకు చీరల పంపిణీ



పామర్రు: మహాశివరాత్రి సందర్భంగా పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో శనివారం 100 మందికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నాయకత్వంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ మహా శివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, పార్టీనాయకులు ఆరేపల్లి రాకేష్, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, న్యాయవాది చిన్నం శ్రీనివాసరావు, కృష్ణా మిల్క్ యూనియన్‌జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు ఎస్‌సింహాచలం, కందుల నరసింహారావు,బుల్లియ్య, మ ద్రెడ్డి అంజిరెడ్డి, ఆరేపల్లి శ్రీహరి, కొచ్చెర్ల శ్రీనివాసరావు, ధనాల నాగేంద్రరావు, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, సజ్జప్రకాష్, పరసా కిషోర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నంటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం సమావేశం జరిగింది. సంఘ జిల్లా చైర్మన్ బి. లంకేష్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ డీఈఓ ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర నాయకులు రావెళ్ల వరుణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం ఎంతో మేలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు, రోగ నిరోధక శక్తి పెరుగుదలకు భారతీయ సనాతన వైద్య విధానమైన ఆయుర్వేదం ఎంతో మేలు అని ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు. బాపులపాడు మండలం పెరికీడులో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్, కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ కె.వాహిని నేతృత్వంలో డాక్టర్ కె.సునీత, డాక్టర్ మౌళీ నాయక్, డాక్టర్ మురళీ బాబు సేవలు అందించారు. సుమారు 530 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం ,హేమేశ్వర నరసింహమూర్తి పాల్గొన్నారు.

హర హర మహాదేవ

- వైభవంగా మహా శివరాత్రి
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- పుణ్యస్నానాలతో కృష్ణాతీరం కిటకిట
- మార్మోగిన శివనామస్మరణ



పెద్దశివాలయంలో బారులు తీరిన భక్తులు



కలిదిండి భోగేశ్వరస్వామి దేవస్థానం వద్ద భారీగా తరలివచ్చిన భక్తులు



ఐలూరులో రామేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: శివనామస్మరణతో మండలంలోని ఐలూరు గ్రామం మార్మోగింది. భక్తజనంతో కృష్ణా తీరం జనసంద్రంగా మారింది. భక్తులతో రామేశ్వర స్వామి ఆలయం పోటెత్తింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి శనివారం వేకువజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. అధికారులు జల్లుస్నానాలను ఏర్పాటు చేశారు. జంగమదేవరలు, గంగిరెద్దులవారి పొగడ్తలు, ఆటపాటలు, విన్యాసాలతో కృష్ణానదీ తీర ప్రాంతం సందడిగా మారింది.

కిటకిటలాడిన ఆలయం..

నదిలో పుణ్యస్నానాల అనంతరం స్థానిక శ్రీరామేశ్వరస్వామి ఆలయానికి భక్తులు బారులుతీరారు. శ్రీరామేశ్వరస్వామిని, పక్కనే ఉన్న రఘునాయక స్వామిని భక్తులు దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ రమేష్, ఆలయ చైర్మన్ సూర్యవరప్రసాద్, మేనేజర్ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే కైలే ప్రత్యేక పూజలు..

రామేశ్వరస్వామిని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి నూతనవస్త్రాలను సమర్పించి వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడకుదురు రాజేంద్ర, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, గురివిందపల్లి సర్పంచ్ చక్కా ఉదయభాస్కర్, ఎంపీటీసీ భీమవరపు శ్రీలక్ష్మి, నాయకులు షేక్ లతీఫ్‌హుస్సేన్, సుంకర రాఘవరావు, దేవరపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా..

తోట్లవల్లూరు: మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామిని, వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, వీఆర్‌ఓ నాగేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు. తోట్లవల్లూరులో ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యాన భక్తులకు పులిహోర పంపిణీ జరిగింది. ఆర్యవైశ్య సంఘం ప్రాంతీయ కార్యదర్శి తమ్మన ఉమామహేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొత్త శేష శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. గరికపర్రులో వీరమ్మతల్లి భక్తులకు బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యాన అల్పాహారం పంపిణీ జరిగింది. బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, కార్యదర్శి సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గుడివాడటౌన్: పట్టణంలోని శివాలయాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చెయ్యడంతో వేకువజాము నుండే భక్తులు క్యూ కట్టారు. స్థానిక గౌరీశంకరపురంలోని గౌరీశంకరస్వామి వారి దేవస్థానం (చిన్నశివాలయం) బేతవోలులోని ఆనందేశ్వరస్వామి వారి దేవస్థానంలలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనం చేసుకున్నారు. స్థానిక పామర్రు రోడ్ లోని పెద్దకాల్వలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ఎన్‌సీసీ వలంటీర్లు, పోలీస్‌వారి సహకారంతో భక్తులను క్రమపద్ధతిలో నియంత్రించారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆనందేశ్వరి స్వామి దేవస్థానం పాలకవర్గ చైర్మన్ ఆంజనేయదాసు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడటౌన్ : ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టెలిఫోన్ నగర్ లోని శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో నారాయణస్వామి వారికి శనివారం క్షీరాభిషేకం చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి పుష్పాభిషేకం, సామూహిక కుంకుమార్చన గావించారు. వేంకటేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి గానార్చన, అన్నసమారాధన చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎంవీ నారాయణరెడ్డి, ఆలయ అధ్యక్షుడు ఎం సీహెచ్ నారాయణ రెడ్డి, కోశాధికారి లక్ష్మి నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి శివ, కుటుంబరావు, చంద్రశేఖర్, నారాయణరావు, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: మండల పరిధిలోని ప్రాకర్ల గ్రామంలో గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయం పక్కనే ఉన్న కొలనులో భక్తులు పుణ్య స్నానాలు చేసి పితృ కర్మలను ఆచరించి స్వామిని పూజించారు. గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఆలయంలో స్వామికి విశేషంగా ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అంకమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన శివ లింగానికి భక్తులచేత విశేషంగా అభిషేకాలు చేశారు .ఆలయ కమిటీ సభ్యులు వరదా అప్పారావు భక్తులు పాల్గొన్నారు. బుచ్చమ్మ తల్లి ఆలయంలో పర్వత వర్ధనీ సమేత మల్లేశ్వరస్వామికి అభిషేకాలను జరిపించారు. అడ్డాడ గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నెమ్మలూరు, కొరిమెర్ల, ఎలకుర్రు, నిమ్మకూరు, కనుమూరు, కురుమద్దాలి, పసుమర్రు తదితర గ్రామాలలోని శివాలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

పామర్రు: గంగాపార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి వారి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా శనివారం రాత్రి నిర్వహించారు. ఆలయ అర్చకులు సాంబశివరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ మేనేజరు కందుల వెంకట్రరెడ్డి తెలిపారు. రాపర్ల గ్రామంలోని గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భ్రమరాంబ సమేత మల్లేఖార్జున స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బృందావనం గోపాలకృష్ణ మాచార్యులు, బృందావనం పద్మాకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారని ఆలయ నిర్వాహకులు కాకర్ల బలరామమూర్తి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు.

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ సిద్దేశ్వరాలయంలో స్వామి వారికి ఏకాదశ రుద్ర హోమం జరిగింది. కొతవరం గౌతమేశ్వరాలయంలో ఆలయ ప్రధానార్చకుడు అంబా గౌతమేశ్వరరావు అర్చక బృందం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. వేమవరంలో శ్రీ నాగేశ్వర స్వామివారి ఆలయంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రుద్రపాక లక్ష్మీ మల్లేశ్వరరావు ఆధ్వర్యాన స్వామివారికి విశేషాభిషేకాలను పండితుడు శరత్‌చంద్ర నిర్వహించారు. గుడ్లవల్లేరు శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి పంచాయన క్షేత్రంలో నగరేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. విన్నకోట భోగేశ్వరాలయంలో అభిషేకాలు చేశారు. అంగలూరు అమరేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకులు పాలపర్తి నరసింహారావు, చిలుమూరు సత్యనారాయణ స్వామి వేద మంత్రోచ్ఛరణ నడుమ చేపట్టారు. స్వామివారికి గ్రామోత్సవం జరిగింది.

మండవల్లి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని మండవల్లి, లింగాల, అల్లినగరం, అయ్యవారిరుద్రవరం శివాలయాల్లో అర్చకులు విశేష పూజలు చేశారు. స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు గూడూరు హనుమశ్శాస్త్రి మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

పెదపారుపూడి: మండలంలోని పలు శివాలయాల్లో శనివారం మహాశివరాత్రి సందర్భంగా స్వామి వార్లకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వానపాముల రామలింగేశ్వరరావు స్వామి ఆలయంలో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు చేశారు. వెంట్రప్రగడ నామేశ్వరస్వామి ఆలయంలో ఏకా రుద్రాభిషేకాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. యలమర్రులో వేంచేసియున్న శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో భక్తుల అధిక సంఖ్యలో స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కూచిపూడి(మొవ్వ): శనిత్రయోదశి సందర్భంగా శనివారం నవగ్రహాలకు తైలాభిషేకాలు, నల్ల నువ్వులతో విశేష పూజలు నిర్వహించారు. మాఘ బహుళ త్రయోదశి శనివారం కలిసి రావటంతో వేకువ జాము నుంచే ఆలయాలు కిటకిటలాడాయి. ఇందులో భాగంగా కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నవగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. పెడసనగల్లు, కూచిపూడి, మొవ్వ, పెదపూడి, గూడపాడు, అయ్యంకి, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వపాలెం గ్రామాల్లోని నవగ్రహ మండపాల్లో శనీశ్వరునికి అభిషేకాలను చేశారు.



స్వామివారికి పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు



కొతవరం గౌతమేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కూచిపూడిలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



ప్రాకర్లలోని కొలనులో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన భోగేశ్వరలంక



దేవస్థానం వద్ద ఎమ్మెల్యే డీఎన్నార్, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ



దేవస్థానం వద్ద భారీగా భక్తులు

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డీఎన్నార్, జయమంగళ

కై కలూరు(కలిదిండి): కలిదిండి భోగేశ్వరలంకలో శివనామస్మరణతో మార్మోగింది. సమీప ప్రాంతాల నుంచి లక్షా 50 వేల పైబడి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం నుంచి భారీ 'క్యూ' లైన్‌లో భక్తులు స్వామి దర్శనానికి వేచి ఉన్నారు. పవిత్ర కోనేరు వద్ద స్నానాలు ఆచరించారు. వేలాది మంది పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు జయమంగళ వెంకటరమణ స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి స్వామివారి తెప్పోత్సవం, వీరభద్ర పళ్లెం వైభవంగా జరిగింది. ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీఎస్ పైడేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐ వైవీవీఎల్ నాయుడు, నాగరాజు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు భక్తులకు సౌకర్యాలు సమకూర్చారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు సురేష్‌కుమార్, రంగారావు ఏర్పాట్లును పరిశీలించారు. ఆలయ చైర్మన్ అడవి వెంకట గంగాధర శర్మ, ధర్మకర్తలు బలరామరాజు, భోగరామరాజు, సుబ్బలక్ష్మి, లక్ష్మీకుమారి, ధనలక్ష్మి, అచ్చమ్మ, తాటి కుమారి, పాపారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తులకు అన్నదానం...

ఆలయం వద్ద వివిధ సామాజికవర్గాలకు చెందిన పెద్దలు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వీటిని ప్రారంభించారు. ఐలమ్మ రజక సంఘం, బీవీ రావు ఫౌండేషన్, కలిదిండి విద్యుత్‌శాఖ, భీమవరం వర్మ హాస్పటల్ వంటి పలువురు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కైకలూరు ప్రజాపిత బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివ క్షేత్రాల ప్రదర్శన ఆకట్టుకుంది. హాస్యభరిత నాటక సీన్లు, సారంగధర నాటకం ప్రేక్షకులను అలరించింది. ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు వినయ్, శ్యామ్, చేబోయిన వీర్రాజు, పోసిన చెంచు రామారావు, ముంగర నరసింహారావు, కలిదిండి సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, నంబూరి బాబి, బూరుబోయిన శ్రీనివాసరావు, నున్న భగవానులు, నీలపాల వెంకటేశ్వరరావు, ఊర కల్యాణి, చిట్టూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేసిన కనకపు శివలింగం



భక్తుల దర్శనానికి ఉంచిన బంగారు శివలింగం

గుడివాడటౌన్: స్థానిక వాసవీచౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బంగారు శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పాలకవర్గం నిర్ణయం మేరకు రజిత పూరక కనకపు లింగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ జవ్వాజి గంగరాజు తెలిపారు. ఈ ఏడాది స్వామివారికి భక్తులు ప్రత్యక్షంగా అభిషేకాల నిర్వహణకు అవకాశం కల్పించామన్నారు. అనంతరం అమ్మవారి దేవస్థానంలో గుడివాడకు చెందిన శ్రీదుర్గాభవాని భక్తబృందం ఆధ్వర్యంలో సాయినామ సంకీర్తన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వెంకట జగ్గారావు, టంగుటూరి వెంకట సుబ్బారావు, ఐదా గోపాలకృష్ణమూర్తి, చిన్నం గంగాధరరావు, కె సాయి సుబ్రహ్మణ్యం, ఘంటసాల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



ఆటపాక కనకలింగేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

కైకలూరు: ఆటపాక కనకలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) దంపతులు పాల్గొన్నారు. శనివారం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు తిమ్మనేని లక్ష్మీ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, ఉపసర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, కన్నా రాము, సాంబయ్య, రామిశెట్టి బుజ్జి, గుడిపాటి జనన్నాథం, వేల్పూరి నాగేశ్వరరావు, మాదాసు రాజు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేడు పిల్లలకు వైద్య శిబిరం

మండవల్లి: పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పిల్లలకు ఉచిత ఆరోగ్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. గుడివాడ ఉమ పిల్లల వైద్యశాల డాక్టర్లు పిన్నమనేని రామకృష్ణప్రసాద్, మాధవి, విజయవాడ అంకుర, రెయిన్‌బో ఆస్పత్రుల వైద్యులు పరీక్షలు చేస్తారని, మందులు ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



మాజీ ఎమ్మెల్యే జయమంగళకు రాచపట్నం గ్రామస్తుల అభినందనలు

కైకలూరు: వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృతనిశ్చయంతో పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ చెప్పారు. టీడీపీ విధానాలు నచ్చక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణకు పలు గ్రామాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. ఆయనను తన నివాసం వద్ద శనివారం నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు పూలదండలతో అభినందించారు. పార్టీ నాయకులు సయ్యపు రాజు గుర్రాజు, పలువురు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత



పెడన: ఆధార్ సేవలను ఉత్తమంగా అందించిన ఆరుగురికి ప్రశంసా పత్రాలను అందజేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన స్టేట్ ఆధార్ మీటింగ్‌లో స్టేట్ కమిషనర్ రామ్‌నాథ్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఆధార్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ తూము లక్ష్మణ్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు కె. రామారావు, ఎస్ అభినయ్, షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్. జగదీష్, ఎం. కిషోర్‌బాబు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

21న మాతృభాషా దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో భవానీ ద్వీపం నందు హంపి థియేటర్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం వ్యవస్థాపకులు పీవీఎల్ ఎన్ రాజు(అబ్బు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతృభాషా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు.

శాసన పరిశోధకులు, చారిత్రక రచయితలను సత్కరిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలుగు జాతీయులు, తెలుగు భాషాభిమానులు వేడుకల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బందరు సబ్–డివిజన్‌లో 30 పోలీస్ యాక్టు అమలు

కోనేరుసెంటర్: బందరు సబ్–డివిజన్ పరిధిలో ఈ నెల 18 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని బందరు డీఎస్పీ మాసూంబాషా శనివారం తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఏ ఒక్కరూ సభలు, సమావేశాలు, ధర్నాలు, నిరసన దీక్షలు, బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా అలాంటి కార్యక్రమాలు తలపెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏవైనా కార్యక్రమాలు నిర్వహించదలచిన వారు ముందుగా సబ్ డివిజినల్ అధికారి నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంద ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పోలీసుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కార్యక్రమాలు తలపెడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మాసూంబాషా హెచ్చరించారు.